మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# జిల్లాలో సిటీ పోలీసు యాక్ట్ అమలు

## సిద్దిపేట సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 25 నుంచి నవంబరు 9 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు,ర్యాలీలు,రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహిస్తే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. బంద్‌ల పేరిట బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు ఉన్నాయన్నారు. నిబంధనలను ఉల్లంఘించి డిజె వినియోగిస్తే చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు.

# కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

## దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్(తొగుట), అక్టోబరు 24, ప్రభాతవార్త :** రైతులు పంట లను దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని మద్దతు ధరను పొందాలని దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తొగుట మార్కెట్ యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారం భించి మాట్లాడారు. ప్రభుత్వం మొక్కజొన్నలకు మద్దతు ధర రూ.2400 అందిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎవో మోహన్, కాన్గల్ సొసైటీ సీఈవో గంగారెడ్డి, వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, మాజీ సర్పంచ్ పాగాల కొండలురెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్లు చిక్కుడు బాలమల్లు, సంతోష్, నాయకులు కొంగరి నర్సింలు, మైపాల్‌రెడ్డి, బూస నిరంజన్‌రెడ్డి, ఎన్నం భూపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, బుర్ర నర్సింలు, బాలరాజు, భరత్, బర్రింకల స్వామి, చిక్కుడు స్వామి, బీరయ్య పాల్గొన్నారు.



క్రానికల్ ఆఫ్ ప్రొగ్రెస్ ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న దండ రాజిరెడ్డి

## ఉద్యాన రంగంలో నూతన ఆవిష్కరణలపై దృష్టి

### -ఉద్యాన వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి

**ములుగు, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** ఉద్యాన పంటలు, ఉత్పత్తులు రాష్ట్రంలోని ప్రతి ఇంటికి అందేలా 'ఇంటింటికి ఉద్యానం' అనే కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. సంవత్సర పరిపాలన కాలం సందర్భంగా విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానరంగంలో మేలైన అభివృద్ధికి కృత్రిమ మేధను అన్వయించేందుకు కావాల్సిన ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఆధునిక హంగులతో పరిశోధన ఇంకుబేషన్ కేంద్రాలు, విద్యార్థుల కోసం అంకుర పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు పోటీ పరీక్షలలో నైపుణ్యం పెంచేందుకు జేఆర్ఎఫ్ కం కాంపిటీటివ్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అనేక లాభాలు ఉన్న జీనోమ్ ఎడిటింగ్, టిష్యూ కల్చర్‌పై పరిశోధనలకు ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు పరిశోధనలో ఆవిష్కరణలకు ఆసక్తి చూపాలని, ఫలితాలు ఎప్పటి కప్పుడు రైతులకు అందేలా పేరెన్నిక కలిగిన జనరల్లో పరిశోధన పత్రాలు ప్రచురించాలన్నారు. అలాగే విద్యార్థులే వర్సిటీ భవిష్యత్తుకు మూల స్తంభాలుగా ఎదగాలని వైస్ ఛాన్సలర్ పిలుపునిచ్చారు. విద్యార్థి స్థాయిలోనే మరింత లోతైన పరిశోధనలు చేపట్టేందుకు గాను దేశంలో పేరుపొందిన పరిశోధన సంస్థలతో కలిసి పనిచేసేందుకు విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరంలో వైస్ ఛాన్సలర్ నేతృత్వంలో జరిగిన పరిశోధన, బోధన, విస్తరణ రంగంలో సాధించిన విజయాలను వర్సిటీ డీన్ డాక్టర్ జె.చీనా నివేదించారు. అనంతరం ఈ సంవత్సరంలో వర్సిటీ సాధించిన విజయాలపై రూపొందించిన క్రానికల్ ఆఫ్ ప్రోగ్రెస్ ఆల్బమ్‌లను వైస్ చాన్సలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్ డాక్టర్ జె.చీనా, రిజిస్టర్ డాక్టర్ ఏ.భగవాన్, డాక్టర్ ఎం.రాజశేఖర్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ ఎన్.శ్రీనివాసన్, కన్సల్టెంట్ డాక్టర్ కె.వీరాంజనేయులు, డాక్టర్ వినోదిని, అసోసియేట్ డీన్‌లు డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ సైదయ్య, డాక్టర్ అనితకుమారి, పోతురాజు యాదయ్య, చెంచు రామయ్య, వీరన్న, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాగంటి సునీత గెలుపు ఖాయం

### -ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీత గోపినాథ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్ శివాజీ నగర్‌లో మాగంటి సునీత గోపినాథ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలన్నా, ప్రతీ ఒక్క నిరుపేదతో పాటు అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలన్నారు. ఇక్కడి ప్రజలు కెసిఆర్ పాలనను ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారని, ఎవరిని కదిలించినా కెసిఆర్ సంక్షేమాన్ని గుర్తు చేస్తూ ఆయన నాయకత్వమే శ్రీరామరక్ష అని అంటున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వెనుకబాటుకు గురైన నగర బస్తీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఏ విధంగా అభివృద్ధి చెందాయో మనందరికీ తెలుసు అన్నారు. ప్రపంచ స్థాయి పరిశ్రమలు, అభివృద్ధి చెందిన దేశాలకు ధీటుగా నగరంలో మౌలిక వసతుల కల్పన, సామాన్య ప్రజలు సైతం ప్రశాంత వాతావరణంలో జీవించే విధంగా శాంతిభద్రతల పరిరక్షణ, నగరవాసులకు ఉపాధి మార్గాలు చూపే కేంద్రాల ఏరానపటు వంటి ఎన్నో వసతులను కల్పించిన ఘనత నాటి ముఖ్యమంత్రి కెసిఆర్, బిఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సప్పిడి శ్రీనివాస్, రమేష్‌గౌడ్, బీమప్ప, సంతోష్, సత్య, అనిల్, నరేష్, చందు, దారాసింగ్, మల్లేష్, భరత్, బారసింగ్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎసిపి సదానందకు పూల మొక్కను అందజేస్తున్న వైద్యులు

**హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 24, ప్రభాతవార్త :** సురభి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, సురభి మెడికల్ కళాశాల మిట్టపల్లి ఆధ్వర్యంలో శుక్రవారం హుస్నాబాద్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 600 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అపరేషన్ అవసరం ఉన్నవారిని హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఆసుపత్రి డిన్ డాక్టర్ రఫీ,సీఈడి డాక్టర్ దీప్తిరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంఎస్ డాక్టర్ శ్యామ్, డాక్టర్ యోగేందర్, ఎసిపి సదానందం, ఎస్ఐ లక్ష్మారెడ్డి, ఎఎంసి చైర్మన్ తిరుపతి, పిఎసిఎస్ చైర్మన్ శివయ్య, ఎఎంసి వైస్ చైర్మన్ చందు, మాజీ ఎంపిపి వెంకన్న, మాజీ ప్రజాప్రతినిధులు సది, పద్మ, రమేష్, వాలా నవీన్, 60 మంది సీనియర్ డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సిద్దిపేట రూరల్(తొగుట), అక్టోబర్ 24, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని పెద్దమాసాన్‌పల్లి సబ్ స్టేషన్ మరమ్మతులో భాగంగా ఈనెల 25న ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎఈ ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దమాసాన్‌పల్లి సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా పెద్ద మాసాన్‌పల్లి, ఇందిరానగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు.

# అధికారుల అలసత్వంతో ఆగిన ఆలయ 'సత్రం'

*** ఏడేళ్లు దాటినా పట్టించుకోని కాంట్రాక్టర్ * పిఆర్ నుంచి దేవాలయానికి అప్పగించాలని కలెక్టర్‌కు వినతి**

**కొమురవెల్లి, అక్టోబరు 24, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని బండగుట్టపై శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి భక్తుల సౌకర్యార్థం రూ.14 కోట్లతో 50 గదుల వసతి సత్రం నిర్మాణ పనులను 2018లో ప్రారంభించారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన 50 గదుల సత్రం నిర్మాణం పనులు నేటికి నత్తనడకన కొనసాగుతూ అసంపూర్తిగా మిలిగిపోతున్నాయి. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన పనులు ఏడేళ్లు కావస్తున్నా పట్టించుకునే నాథుడు లేదు. పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా పనులు పూర్తి కావడం లేదు. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్వామి వారి దర్శనానికి ప్రతి నిత్యంతో పాటు ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తుంటారు. ఇప్పటికే కార్తీక మాసం ప్రారంభం కావడంతో స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. వచ్చే డిసెంబర్ లో మల్లన్న కళ్యాణంతో స్వామి వారి జాతర, బ్రహ్మోత్సవాలు మూడు నెలలు కొనసాగుతాయి. మల్లన్న జాతర సందర్భంగా తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. దీంతో భక్తులకు గదుల కొరత ఏర్పడనుంది. స్వామివారి కళ్యాణం వరకు గదుల నిర్మాణం పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**నిర్మాణ పనులు దేవాలయానికి అప్పగించాలి...**

మండల కేంద్రంలోని బండగుట్ట వద్ద స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్, దేవాదాయ నిధుల పంచాయతీరాజ్‌శాఖ ద్వారా చేపట్టిన నిర్మాణం పనులు పూర్తికాకపోవడంతో గ్రామస్తులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2018లో ప్రారంభించిన 50 గదుల నిర్మాణ పనులు నేటీ వరకు పూర్తి చేయకుండా అసంపూర్తిగా మిగిలిస్తున్న పంచాయతీరాజ్ శాఖ నుంచి దేవాలయానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్‌కు ఆలయ అధికారులు వినతి పత్రం అందజేశారు. 2020 ఫిబ్రవరిలో సత్రం నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉండగా పంచాయతీరాజ్ అధికారుల అలసత్వం కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తిగానే మిగిలిపోయయని దేవాలయ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీరాజ్ అధికారులు పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి ఉంటే ఇప్పటికే పనులు పూరైయ్యె అందుబాటులోకి వచ్చి ఉండేవని ఆలయ అధికారులు అంటున్నారు. దేవాలయ నిధుల నుంచి కాంట్రాక్టర్‌కు ఎంబి రికార్డుల ప్రకారం రూ.4.15 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. సత్రం నిర్మాణం పనుల్లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, పోర్టికో, డోర్స్ తదితర పనులు చేయాల్సి ఉందని తెలిపారు. పనులను పూర్తిచేయడంలో పంచాయతీరాజ్ అధికారులతోపాటు కాంట్రాక్టర్ విఫలమైనందున మిగిలిపోయిన పనులను పూర్తిచేయడానికి దేవాలయానికి అప్పగించటానికి పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు జారీచేయాలని ఆలయ అధికారులు కోరుతున్నారు.



అసంపూర్తిగా మిలిగిపోయి దర్శన మిస్తున్న గదుల నిర్మాణం



కోమటిబండలోని ప్రాథమిక పాఠశాల(ఇన్‌సెట్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి మన్విత్)

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థికి విద్యుత్ షాక్

### -హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన ఉపాధ్యాయులు

### -ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

**గజ్వేల్, అక్టోబరు 24 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కోమటిబండ ప్రాథమిక పాఠశాలలో ఓ విద్యార్థికి గురువారం మధ్యాహ్నం విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితిలో పడిపోగా అక్కడే ఉన్న ఉపాధ్యాయుడు హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. కోమటిబండ గ్రామానికి చెందిన మన్విత్ 5వ తరగతి చదువుతున్నాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లగా ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం మన్విత్‌ను బోరు స్విచ్ వేయమని చెప్పాడు. వెంటనే ఆ విద్యార్థి స్విచ్ వేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో అతడిని ఉపాధ్యాయుడు దామోదర్‌చారి సిపిఆర్ చేసి హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయంపై విద్యార్థి తల్లిదండ్రులు నుంచు స్వామి, శ్యామల మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులతో ప్రతిరోజు పనిచేయిస్తున్నారని, ఆయా ఉన్నప్పటికీ విద్యార్థులతో ఊడిపించడం, బోరు వేయడంలాంటి పనులు చెబుతున్నారని, ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడుకుకు అయ్యే ఆసుపత్రి ఖర్చులను ఎవరు భరిస్తారని ఆవేదన వ్యక్తంచేశారు. జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడిని ఎలా జరిగిందని అడిగితే మాపైనే దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల పనితీరు ఇలా ఉంటే విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉంటుందని వాపోయారు. ఈ విషయంపై ఎంఈఓను వివరణ కోరగా కోమటిబండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి విద్యుత్‌షాక్‌కు గురికావడం బాధాకరమని, ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి సదరు ప్రధానోపాధ్యాయునిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

**సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 24, ప్రభాతవార్త :**

2024 మార్చి నుంచి పదవి విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ విశ్రాంత ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నమల్ల రాములు, ప్రధాన కార్యదర్శి ఎం.డి.సలీంలు మాట్లాడారు. పదవీ విరమణ పొంది ఉద్యోగులు 18 నెలలు గడిచిన నేటికీ ప్రభుత్వం చెల్లించాల్సిన విశ్రాంత బకాయిలను చెల్లించకపోవడం సరికాదన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన లాభాలను చెల్లించకుండా మానసికంగా వేధించడం, అనారోగ్యాలకు గురిచేయడం సర్కార్‌కు తగదన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2024 మార్చి నుంచి ఇప్పటీ వరకు 16500 మంది ఉద్యోగులు పదవి విరమణ పొందారని తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే పిఆర్‌సి 2020 ఏరియర్స్, జిపిఎఫ్, జిఐఎస్, టిఎస్‌టిఎల్ఐ కమ్యుటేషన్ గ్రాట్యూటీ, సర్వీసులో ఉన్నప్పుడు చేసుకున్న సరెండర్ లీవ్‌లూ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు బకాయిలను వెంటనే చెల్లించి విశ్రాంత ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఈడబ్ల్యుఎ ప్రతినిధులు పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం





నారాయణపూర్ సమీపంలోని తెలంగాణ బాలికల గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(ఇన్‌సెట్‌లో గాయపడిన బాలిక కాలు)

## గురుకుల గిరిజన విద్యార్థినులపై ఎలుకల దాడి

### 8 మంది విద్యార్థులకు గాయాలు

**నర్సాపూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ సమీపంలోగల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలికలు)లో శుక్రవారం ఇంటర్మీడియట్ విద్యార్థినులను ఎలుకలు కరవడం మండలంలో కలకలం రేపింది. గురుకుల పాఠశాలలోనే వసతి గృహం ఉంది. శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న విద్యార్థినులను ఎలుకలు కాలు దగ్గర కరవడం, శరీరం పై పాకడం జరిగింది. ఈ ఘటనలో 8 మంది విద్యార్థులను గాయాలయ్యాయి. మరి కొంతమంది విద్యార్థినులకు దురదపుట్టడం జరిగింది. గాయాలైన విద్యార్థినులను చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఏరియా ప్రభుత్వఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సను అందించారు. నికిత,జ్యోతి, ఉష, గీతాంజలి, సంధ్య, అశ్వితమరో ఇద్దరు విద్యార్థినిలు ఎలుకలు గాయపర్చాయి. ఈ విషయంపై ప్రిన్సిపాల్ లలితాదేవిని వివరణ కోరగా హాస్టల్లో ఎలుకల బెడద విపరీతంగా ఉందని, రాత్రి సమయంలో విద్యార్థులపైనే కాకుండా తనపై నుంచి ఎలుకలు పాకుతున్నాయని వెల్లడించారు. గురుకులంలో ఎలుకలే కాకుండా కోతులు దాడి చేస్తున్నాయని తెలిపారు. గిరిజన గురుకుల హాస్టల్లో 540 మంది విద్యార్థినిలు విద్యను అభ్యసిస్తున్నారని, వారికి సరైన వసతులు లేవని, పడుకోవడానికి సరిపోయేంత స్థలం లేదని, హాస్టల్ చుట్టుపక్కల పంట పొలాలు ఉండడం వల్ల ఎలుకలు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహంలో విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించాలని ముఖ్యంగా పడుకోవడానికి మంచి వసతి కల్పించాలని ప్రిన్సిపాల్ లలితాదేవితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

**టిఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వర్, విక్రంరెడ్డి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట జిల్లాగా ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు ఉద్యోగులు కష్టపడి జిల్లాను అన్ని రంగాలలో ముందుంచి దేశానికి ఆదర్శంగా నిలుపుతూ వస్తున్నారని టిఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కోమండ్ల విక్రంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రసర్కార్ అమలుచేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికి ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి 75 ఏళ్ల నుంచి టిఎన్జీవోల సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సంఘం అంటే కన్నతల్లితో సమానంగా భావిస్తూ భవిష్యత్‌లో సంఘం పటిష్టతకు సమస్యల సాధనకు కృషి చేయడం జరుగుతుందన్నారు. యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు వారి వారి యూనిట్లలో సభ్యత్వ నమోదు త్వరగా పూర్తి చేసి సభ్యత్వ నమోదు రాష్ట్ర సంఘానికి అందజేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉద్యోగులు సంఘంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యలను జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రితో పాటు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడానికి ఎప్పటికప్పుడు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఉద్యోగులు ఐక్యంగా సంఘం పటిష్టతకు కృషి చేయాలన్నారు.

**పలు తీర్మానాలు చేసిన సభ**

ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన 5 డిఎలను వెంటనే విడుదల చేయాలని ఈహెచ్ఎస్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సభలో తీర్మానం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని ఉద్యోగులకు అమలు చేయాలని తీర్మానించారు. ధరలకు అనుగుణంగా పిఆర్‌సిని ప్రకటించాలని జీవో 317 బాధిత ఉద్యోగులకు తాత్కాలిక డిప్టేషన్‌లతో పాటు స్థానికత ఆధారంగా శాశ్వత బదిలీలు చేపట్టాలని పంచాయతీరాజ్‌శాఖలో ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీచేయాలని తీర్మానించారు. నీటి పారుదల శాఖలో రాష్ట్రపతి ఉత్తర్వులు అమలు చేస్తూ అంతలోపు ఉన్న ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని అలాగే పలు తీర్మాణాలు చేశారు. సమావేశంలో టిఎన్జీవోల సంఘం ప్రతినిధులు వెంకటేశ్వర్లు, నిమ్మ సురేందర్‌రెడ్డి, అశ్వక్ అహ్మద్, యూనిట్ అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఎన్జీవో నేతలు

# పదేళ్లు దాటినా అందుబాటులోకి రాని వే బ్రిడ్జి

**బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్**

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 24, ప్రభాతవార్త**

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్లో వే బ్రిడ్జ్ పది సంవత్సరాల క్రితం మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్‌కుమార్ ప్రారంభించినా తూకం వేయడంలో మార్కెట్ అధికారులు, పాలకవర్గం దృష్టి పెట్టకపోవడం వల్ల లక్షల రూపాయలు వృధా అవుతున్న పరిస్థితి కనబడుతుందని బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్, భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వేబ్రిడ్జిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం తూకం వేసేందుకు మార్కెట్‌లో వేబ్రిడ్జి అందుబాటులో లేకపోవడం వల్ల బయట వెబ్రిడ్జిలలో తూకం వేయడంలో మోసాలు జరుగుతున్నాయని ఆరోపణలు వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని, ఈ వేబ్రిడ్జిని ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకుని వస్తే రైతులకు తూకంలో మోసం జరగకుండా పరిస్థితి ఉంటుందన్నారు. అంతే కాకుండా లక్షల రూపాయలతో మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టేందుకు వ్యవసాయ యంత్రం డ్రయ్యర్ పని చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సీజన్‌లో అకాల వర్షాలతో రైతుల ధాన్యం నానుచున్న పరిస్థితి ఉందని, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ రాష్ట్రంలో పెద్ద మార్కెట్‌గా పేరు ఉందని, రైతులకు సరిపడా డ్రయ్యర్ మిషన్‌లు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేయడం చేశారు. అంతే కాకుండా హుస్నాబాద్ పట్టణంలోని శివాజీనగర్‌లో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీకి సంబంధించిన మినీ ఫంక్షన్ హాల్ రైతుల కూరగాయల మార్కెట్ భవనం ఎందుకు పనికిరాని భవనంలా తయారైందని, హుస్నాబాద్ మార్కెట్ నుండి సొంత నిధులు నాలుగు కోట్లతో నిర్మించిన ఈ భవనంలో ఇప్పటికీ సరైన వసతులు లేవని, కనీసం ఫంక్షన్‌హాల్ అయినా అందుబాటులోకి వస్తే హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు లాభాలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మార్కెట్ పాలకవర్గం సత్వరమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





మాట్లాడుతున్న నాయకులు

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

**కంది, అక్టోబరు 24, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మండల పరిధిలోని ఎర్దనూర్ గ్రామ శివారులో పిఎస్ఆర్ ప్రాజెక్టు పక్కలో సర్వే నంబర్ 179లో గొల్ల సొడయ్య పొలంలో లభ్యమయినట్లు పోలీసులు తెలిపారు. వారం రోజుల నుంచి ఇస్మాయిల్ ఖాన్ పేట ఎర్దనూర్ గ్రామాల శివారులో పిచ్చి పిచ్చిగా కన్నడ, హింధీ భాషలలో మాట్లాడుతూ అటుగా తిరిగాడుతున్నట్లు తెలిసిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తిని గుర్తిస్తే 8712656746/ 8712661831లకు సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.

## రాజోలాలో పేకాటరాయుళ్ల అరెస్టు

### -1లక్ష 80వేల నగదు స్వాధీనం

**న్యాల్‌కల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** గుట్టు చప్పుడు కాకుండా చెరుకుతోటలో పేకాట ఆడుతున్న 11 మందిని గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ దోమ సుజత్ తెలిపారు. ఎస్ఐ దోమ సుజిత్ కథనం ప్రకారం...మండంలోని ఆయా గ్రామాలకు చెందిన 11 మంది రాజోలా గ్రామానికి చెందిన జర్నప్ప వ్యవసాయ క్షేత్రంలోని చెరుకు తోటలో జూదం ఆడుతున్నట్లు విశ్వసనీయంగా తెలుసుకుని చాకచక్యంగా దాడి చేసి జూదరులు అక్కడి నుంచి జారుకోకుండా అదుపులోకి తీసుకున్నామన్నారు. జూదరుల నుంచి 1లక్ష 80వేల రూపాయల నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకుని 11 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ దోమ సుజిత్ వివరించారు.

## సింగూరు ప్రాజెక్టులో వ్యక్తి గల్లంతు

**పుల్‌కల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సింగూరు ప్రాజెక్టు దిగువ భాగంలో వ్యక్తి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల కథ నం ప్రకారం...అందోల్ మండలం అక్సన్‌పల్లి గ్రామానికి చెందిన తలారి గంగారం గురువారం సింగూరు ప్రాజెక్టుకు వచ్చి ప్రాజెక్టులోకి దూకేశాడన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని జాలర్లచే వేతికించినా గంగారం ఆచూకి దొరకలేదు. శుక్రవారం సైతం గంగారం ఆచూకి కోసం గాలించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. మద్యంమత్తులో గంగారం మంజీర నదిలో దూకినట్లు తెలుస్తోంది.

# పార్కు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి కబ్జా

**ఆక్రమణలను తొలగించి 2వేల గజాల పార్కును కాపాడిన హైడ్రా**

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**

పార్కును కబ్జా చేసి.. బైనంబర్లు సృష్టించి సొంతం చేసుకునే ప్రయత్నాలకు హైడ్రా చెక్ పెట్టింది. కొండాపూర్‌లాంటి ఖరీదైన ప్రాంతంలో ఏకంగా 2000 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా శుక్రవారం కాపాడింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని రాఘవేంద్ర కాలనీలో పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 2 వేల గజాలను లే ఔట్‌లో చూపించారు. పార్కు స్థలం ఖాళీగా కనిపించడంతో అక్కడ కొంతమంది కబ్జాకు ప్రయత్నించారు. బై నంబర్లు సృష్టించి 10 ప్లాట్లు చేసేశారు. ప్రతి ప్లాట్‌లో ఒక షెడ్డు వేశారు. ఈ విషయమై రాఘవేంద్ర కాలనీ సి బ్లాక్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు అందింది. దీంతో కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పార్కుతో పాటు.. కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలంగా నిర్ధారించి ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. ఆ వెంటనే ఫెన్సింగ్ వేసి పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటుచేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పార్కు స్థలం విలువ దాదాపు రూ. 30 కోట్ల వరకూ ఉంటుందని పేర్కొన్నారు. 2000ల గజాల చొప్పున 10 ప్లాట్లుగా బై నంబర్లు సృష్టించి కబ్జా చేయడమే కాకుండా.. వాటిని రెగ్యులరైజ్ కూడా చేసుకున్నారు. భవన నిర్మాణానికి అనుమతులు కూడా మంజూరయ్యాయి. ఇంతలో హైకోర్టు ఆదేశాలతో భవన నిర్మాణ అనుమతులను జీహెచ్ఎంసీ వెనక్కి తీసుకుంది. అలాగే రెగ్యులరైజేషన్‌ను కూడా రద్దు చేసింది.



పార్క్ స్థలంలో హైడ్రా బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

# నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నిజాంపేట్, అక్టోబర్ 24, ప్రభాతవార్త**

మయూరి నగర్ సబ్ స్టేషన్, 11కేవీ కేటీఆర్ కాలనీ ఫిడర్ లో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు కేటీఆర్ కాలనీ, కెఎన్‌ఆర్ కాలనీ, శ్రీనివాస్ కాలనీలో కొంత భాగం అలాగే ప్రశాంతిహిల్స్ సబ్ స్టేషన్ 11కేవీ బృందావన్ హిల్స్ ఫీడర్ లో ఉదయం 10 గంటల నుండి 12 గంటలకు మధురానగర్ ఫేజ్ 1, 2, బృందావన్ కాలనీ, అలాగే ప్రశాంతిహిల్స్ సబ్ స్టేషన్ నుండి 11కేవీ ప్రశాంతిహిల్స్ లో 2 నుండి 5 గంటల వరకు ప్రశాంతిహిల్స్, మధురానగర్, ఎన్టీఆర్ కాలనీలో కొంత భాగం 11కేవీ శ్రీనివాస కాలనీ ఫీడర్ లో శ్రీనివాస కాలనీ, ప్రశాంతి హిల్స్, 191 ఎన్టీఆర్ నగర్ ప్రాంతం, రెడ్డి అవెన్యూ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని నిజాంపేట ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పుస్తక ప్రదర్శన

**అత్తాపూర్ అక్టోబరు24, ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. శుక్రవారం సెంట్రల్ లైబ్రరీ ప్రాంగణంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పుస్తక ప్రదర్శనను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ ప్రారంభించారు. హైదరాబాద్, ఢిల్లీలకు చెందిన 8 పబ్లికేషన్స్ ఇక్కడ స్టాల్‌లు ఏర్పాటు చేశారు. వివిధ స్టాల్లో ప్రదర్శనకు ఉంచిన పుస్తకాలను రిజిస్ట్రార్‌తో పాటు, విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు పరిశీలించి యూనివర్సిటీ లైబ్రరీ లో కొనుగోలు కోసం ప్రతిపాదించారు. విశ్వవిద్యాలయం లైబ్రేరియన్ డా వివేకవర్ధన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ లైబ్రరీ సైన్స్ డా ఎన్ పి రవికుమార్ పర్యవేక్షణలో ఈ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. మొదటి రోజు పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రదర్శనను సందర్శించారు.

# విషాద జర్నీ..!

## -హైదరాబాద్-బెంగళూరు వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో చెలరేగిన మంటలు

**హైదరాబాద్, అక్టోబరు 24 ప్రభాతవార్త**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ ప్రైవేటు బస్సు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. తాము వెళ్లాల్సిన చోటుకి సురక్షితంగా చేరుకుంటామనే నమ్మకంతో ప్రయాణికులు అంతా గాఢ నిద్రలో మునిగిపోయారు. ఒక్కసారిగా అనుకోని ప్రమాదం. బైక్‌ను ఢీకొనడంతో బస్సులో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు తేరుకునేలోపే మంటలు వ్యాపించి పొగ కమ్మేసింది. ఏం చేయాలో పాలుపోని బస్సులోని అద్దాలు పగలగొట్టి కొందరు కిందకు దూకేశారు. మరికొందరు బస్సులోనే అగ్నికి ఆహుతైపోయారు. కర్నూలు శివారు చిన్నటేకూరులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణమైన ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. ఈ తీవ్ర ప్రమాదం అంతా ఇంతా కాదు. 19 మంది ప్రయాణికులు మృతి చెందిన ఈ ప్రమాదంలో కొందరు తృటిలోప్రాణాలతో బయపడ్డారు. అయితే, ఈ ప్రమాదంలో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరిన వారిలో సూరారం, జేఎన్‌టియూ, పటాన్‌చెరు, జెఎన్‌టియూ, మూసాపేట ప్రాంతాల నుంచి పలువురు ఉన్నారు. డ్రైవర్ల అజాగ్రత్త అనాలో..లేక ఓవర్ స్పీడ్ అనాలో తెలియదు. మల్టీ యాక్సిల్ బస్సులు పొడవు ఎత్తు కూడా ఎక్కువగానే ఉండటంవల్ల అనుకోకుండా పక్కకు ఒరిగిందంటేచాలు మొత్తం తల్లకిందు లయిపోతుంది. లిప్తపాటులోనే నిద్రమత్తులో ఉన్న ప్రయాణీకులు శాశ్వతనిద్రలోకి వెళ్లిపోతున్నారు. ఇలాంటి ప్రమాదాలు ఎక్కువగా హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లే సుదూర ప్రాంతాల బస్సుల్లోనే జరుగుతున్నాయి. నియంత్రణ లోపమా, అవినీతి తిష్టవేయడమా లేక డ్రైవర్లకు సామర్థ్యం కొరవడటమా అన్నది ఇపుడు ఎవ్వరూ చెప్పలేని ప్రశ్నలు,. కర్నూలు వద్ద జరిగిన ప్రమాదం ఇదేకోవలోకి చెందుతుంది. లిప్తపాటులోనే బస్సులో 19మంది సజీవదహనం అయిపోయారు. మూడువేల డిగ్రీల ఉష్ణోగ్రతవద్ద వారంతా మాడిమసి అయిపోయారంటే ఆ కుటుంబాల రోదన వర్ణనాతీతం. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. మంత్రులు, ఉన్నతాధికారులు ఎంతమంది అక్కడికి వెళ్లి ఓదార్చినా వారి వేదన, మనోవ్యథ తీర్చలేని ది. రాత్రి సమయం కావడంతో ఎసి బస్సులు, టూ ప్లస్ టూ సీట్లు ఆపై బెర్త్‌లు కావడంతో చల్లటి గాలికి హాయిగా నిద్రలోకి జారుకుంటారు. ప్రయాణీకులు రోజంతా అలసి సొలసి వచ్చి ప్రయాణంలో విశ్రాంతి తీసుకునే అలవాటు 99శాతం మందికి ఉంటుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు బయలుదేరిన బస్సులో కూడా ఇదే విధంగా జరిగింది. అంతా ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ఇద్దరు డ్రైవర్లు 41 మంది ప్రయాణీకులు మొత్తం 43 మంది వరకూ ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా 22 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఒక డ్రైవరు పరారు కాగా మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రహదారిపై బైక్‌ను బస్సు బలంగా ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది. బైక్ బస్సు కిందకు చొచ్చుకుపోయింది. బైక్‌లోని పెట్రోలు లీక్ అయి ఒక్కసారిగా మంటలు చెలరేగి ఈ ప్రమాదం జరిగిందన్నది ప్రాథమిక సమాచారం.

**ప్రమాదాలు అర్థరాత్రుల తర్వాతనే..**

ప్రమాదాలు ఎక్కువగా అర్థరాత్రి దాటిన తర్వాత ఉదయం తెల్లవారుజాములోనే జరుగుతున్నాయి. ఎందుకంటే ఆసమయంలోనే నిద్రకు తాళలేని డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకుంటుంటారు. అందుకే ఇద్దరు డ్రైవర్లను నియమిస్తారు. అధికారులు బస్సులు బయలుదేరేముందు తనిఖీలు కూడా తప్పనిసరిచేయాలి. అలాగే మల్టీ యాక్సిల్ బస్సుల్లో అయితే ప్రమాదాల సమయంలో ఎమర్జెన్సీ ద్వారం నుండి రావడం కూడా కష్టం అవుతోంది. బస్సు ఎత్తు, పొడవు కారణంగా ప్రయాణీకులు తాము బయటకు వచ్చేలోపే ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి మద్రాసు, బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి, షిర్డీలకు ఎక్కువ రూట్లలో బస్సులు నడుపుతున్నారు. వీటన్నింటికీ పర్మిట్లు జారీ విధానంపై ఇప్పుడు శ్రద్ధపెట్టాల్సిన అవసరం ఉంది. బయలుదేరే స్థానం హైదరాబాద్ ప్రమాదాలు ఇతర రాష్ట్రాల్లో జరుగుతుండటంతో రాష్ట్రాల మధ్య సమన్వయం కూడా కొరవడుతోంది. ఈ ప్రమాదాలకు అడ్డుకట్టవేయడం అటుంచి రవాణాశాఖలో వేళ్లూనుకున్న అవినీతి కూడా ఒకింత కారణం అవుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పరిమితికి మించి ప్రయాణీకులను చేరవేస్తుండటం ప్రైవేటు ఆపరేటర్లకు అలవాటుగా మారిపోయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కర్నూలు రోడ్డుప్రమాదం ఈ నేప థ్యంలోకి రాకపోయినా డ్రైవర్ల అజాగ్రత్త లేక స్టీరింగ్ అదుపుతప్పడం వంటి కారణాలతోనే జరిగిందన్నది. అయితే హైవేల్లో ప్రయాణించే సమయాల్లో వేగం నియంత్రణ, ప్రతి వందకిలో మీటర్లకు ఒకసారి తనిఖీలు విధిగా ఉండాలన్న నిబంధనలు అమలుచేస్తేకానీ ఈ ప్రమాదాలు కొంత వరకైనా కట్టడి చేయగలుగుతారని ప్రయాణీకులు, ప్రజల్లో వినవస్తోంది.

**ఛేజింగ్ చేసి మూసాపేట్‌లో ఎక్కాడు గాయాలతో బయటపడిన బీటెక్ స్టూడెంట్..**

ప్రైవేటు బస్సు ప్రమాదంలో ఓ బీటెక్ స్టూడెంట్ గాయాలతో బతికి బయపడ్డాడు. మియాపూర్ లో నివాసం ఉండే జయసూర్య (23) అనే విద్యార్థి ఇంటర్వ్యూ కోసం బెంగళూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తను బుక్ చేసుకున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు మియాపూర్‌లో మిస్సైంది. దీంతో ఛేజింగ్ చేసి మరీ మూసాపే టలో బస్సు ఎక్కాడు. ఉద్యోగం కోసం గంపెడా శలతో వెళ్తున్న విద్యార్థి..చివరికి ప్రమాదానికి గురయ్యాడు. ఎట్టకేలకు బతికి బయటపడ్డాడనే వార్త విని కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకు న్నారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలం నెమలిదిమ్మె గ్రామానికి చెందిన జయసూర్య,. తల్లిదండ్రులు రమాదేవి, సుబ్బారాయుడుతో కలిసి మియాపూర్ మక్త మహబూబ్‌పేట్‌లోని ప్రజా షెల్టర్ అపార్టమెంట్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ఫోన్ చేశాడు జయ సూర్య. తను క్షేమంగానే ఉన్నానని..బస్సు ప్ర మాదంలో తన రెండు కాళ్లకు గాయాలు అవ్వ డంతో కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నట్లు పేరెంట్స్‌కు చెప్పారు. బస్సులో నుంచి ఎలా బయట పడ్డాడో ఫోన్‌లో వివరించారు.

**బెంగళూరు నుంచి దీపావళికి హైదరాబాద్ వచ్చి...**

దీపావళి పండగకి హైదరాబాద్‌లోని మేనమామ ఇంటికి వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ మృతిచెందింది. బాపట్ల జిల్లాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ధాత్రి నగరంలోని మేనమామ ఇంటికి వచ్చి తిరిగి వెళ్తూ మృతి చెదింది.



# మూడు రోజుల వ్యవధిలోనే మూడు బస్సు ప్రమాదాలు!

**హైదరాబాద్, అక్టోబరు 24 ప్రభాతవార్త**

మొన్న స్కూల్ బస్, నిన్న పెళ్లి బృందం బస్సు, తాజాగా మరో ఘోరం అనలం ట్రావెల్స్ బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరగడానికి కారణమేంటి?

బస్సులో మంటలు వ్యాపించి ప్రయాణికులు సజీవ దహనమయ్యారు అనే వార్తలు తరచూ వినిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉరుకులు పరుగుల జీవితంలో బస్సులో సేదదీరుతూ గమ్యస్థానాన్ని చేరాలనుకునే సుదూర ప్రయాణికులు, ఊహించని ప్రమాదాల్లో శాశ్వత నిద్రలోకి వెళ్లడం ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించి వేస్తోంది. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాలతో పోలిస్తే బస్సుల్లో ప్రయాణం సురక్షితం. బస్సులు రోడ్డు ప్రమాదానికి గురైనా ప్రాణ నష్టం అత్యంత తక్కువగా ఉంటుంది. కానీ అదే అగ్ని ప్రమాదానికి గురైన సందర్భాల్లో మాత్రం ప్రాణ నష్టం ఊహకు అందడం లేదు. అసలు బస్సుల్లో అగ్నిప్రమాదాలు జరగడానికి ముఖ్య కారణాలేంటి? మంటలు శరవేగంగా వ్యాపించడానికి కారణాలేంటి? ప్రయాణికులు తేరుకునేలోగానే అగ్ని కీలలు వారిని ఏవిధంగా ముంచెత్తుతాయి? తెలుసుకుందాం..

**నెల రోజుల్లో బస్సు ప్రమాదాలివే : -**

సెప్టెంబర్ 26వ తేదీన హైదరాబాద్ నగరం నుంచి నుంచి విజయవాడ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. మియాపూర్ నుంచి బయల్దేరిన బస్సు ఎస్సార్ నగర్ జంక్షన్‌లో ఉమేశ్ చంద్ర విగ్రహం వద్దకు రాగానేఏసీ నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో ప్ర యాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. -ఈ నెల 22న హైదరాబాద్ నగరంలోని నాదర్‌గు ల్‌లోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సులో మంటలు వ్యాపించాయి. పొగలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్, బస్సును ఆపి దిగిపోయాడు. ఆ తర్వాత బస్సు పూర్తిగా దగ్ధమైంది. విద్యార్థులను ఇళ్ల వద్ద దింపి వెళ్తుండగా కాటేదాన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. -తాజాగా ఈ నెల 24వ తేదీన శుక్రవారం హైదరాబాద్ నుంచి బెంగ ళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు శివారులో ఘోర అగ్ని ప్రమాదా నికి గురైంది. శుక్రవారం తెల్లవారుజామున జరిగి న ఈ ఘటనలో 19 మంది ప్రయా ణికులు సజీవ దహనమయ్యారు. ప్రమాదం జరిగిన సమయం లో బస్సులో 44 మంది ప్రయాణికు లు ఉన్నట్లుగా తెలిసింది. వెనక నుంచి వచ్చిన బైక్ బస్సును ఢీకొట్టిందని, కిందకు దూసుకెళ్లి డీజిల్ ట్యాంకును ఢీకొట్టడంతో మంటలు చెలరేగినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.





**మండే పదార్థాలు...**

బస్సుల్లో ఆయిల్, ప్లాస్టిక్ భాగాలు, రెగ్జిన్, దూది లాంటి మెటీరియల్‌తో సీట్లను తయారు చేస్తారు. ఇవి తేలికగా మంటలు అంటుకుని త్వరగా వ్యాపించేందుకు కారణమవుతాయి.

**ఫ్యూయల్ లీకేజీ...**

రోడ్డు ప్రమాదాల్లో బస్సుల్లోని ఆయిల్ ట్యాంకు, పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే పైపులు దెబ్బతిని లీకవుతుంటాయి. దీంతో అప్పటికే వేడిగా ఉన్న ఇంజిన్ భాగాలపై ఇంధనం పడి మంటలు చెలరేగుతుంటాయి.

**విద్యుత్ షార్ట్ సర్క్యూట్...**

బస్సుల్లో టీవీ, బల్బులు, ఫ్యాన్లు, ఏసీ లాంటి విద్యుత్ ఆధారిత పరికరాలు ఎక్కువగా ఉంటాయి. నాణ్యత లేని వైరింగ్ వాడకం వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగేందుకు అవకాశం ఉంటుంది.

**అధిక వేడి...**

షార్ట్ సర్క్యూట్ తర్వాత ఎక్కువ బస్సు ప్రమాదాలు ఇంజిన్ వేడి కారణంగా జరుగుతుంటాయని సంబంధిత నిపుణులు చెబుతున్నారు. ఇంజిన్ భాగాల వేడి కారణంగా డీజిల్, పెట్రోల్ లీకై మంటలు అంటుకుని బస్సు మొత్తాన్ని దహనం చేస్తాయని చెబుతుంటారు.

**గాలి తీవ్రత...**

బస్సుల లోపలి భాగంలో గాలి వేగం ఎక్కువగా ఉంటుంది. అనుకోకుండా ఫైర్ చెలరేగినపుడు ఈ గాలి మంటలను మరింతగా వ్యాప్తి చేయడంలో ఉపకరిస్తుంది.

అధికశాతం ప్రమాద ఘటనలకు కారణలివే...

ఇంజిన్ అధిక వేడి, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, మండే పదార్థాలు, ఇంధన లీకేజీ వంటివి బస్సుల్లో అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణాలు. ఇక బస్సుల్లో మండే స్వభావం కలిగిన పదార్థాలతో తయారైన వస్తువులు అధికంగా ఉంటాయి. ప్రధానంగా పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనంతో పాటు ప్లాస్టిక్, రెగ్జిన్ కవర్ సీట్లు ఉంటాయి. ఈ పదార్థాలు గాలితో కలిసి త్వరగా మంటలు అంటుకుని, వేగంగా వ్యాప్తి చెందడానికి దోహదపడతాయి. బస్సులలో సరైన అగ్నిమాపక వ్యవస్థలు లేకపోవడం ప్రమాదాల తీవ్రతకు అద్దం పడుతోంది. అప్పటికప్పుడు మంటలు ఆర్పేందుకు తగిన వ్యవస్థ లేకపోవడం ప్రాణ నష్టానికి దారి తీస్తోంది.

**ఇరుకైన స్థలం...** బస్సులో సీట్లు మినహాయిస్తే చాలా తక్కువ స్థలం ఉంటుంది. మంటలు అంటుకున్న సమయంలో భరించలేని వేడి, పొగ ఊపిరి ఆడనివ్వకుండా చేస్తుంది. విష వాయువులు త్వరగా వ్యాపించి, ప్రయాణికులు తప్పించుకోవడానికి చాలా తక్కువ టైం ఉంటుంది.

**కిటికీలు, డోర్లు మూసుకుపోవడం...**

ప్రమాదం జరిగిన తర్వాత బస్సు భాగాలు దెబ్బతింటాయి. దీంతో ఎమర్జెన్సీ మార్గాలు, కిటికీలు దెబ్బతిని తెరుచుకునే అవకాశం ఉండదు. దీంతో ప్రయాణికులు తొందరగా బయటకు వెళ్లే మార్గాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. తక్షణ వ్యవస్థలు లేకపోవడం...

భవనాలు, వాణిజ్య సముదాయాల్లో మంటలు చెలరేగినప్పుడు మంటలు ఆర్పేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైపులు ఉంటాయి. బయట నుంచి మంటలు ఆర్పే వా యువులను పంపించడం ద్వారా మంటలను నియంత్రించవచ్చు. కానీ, బస్సుల్లో మంటలు ఆర్పేందుకు ప్రత్యేక వ్యవస్థలేమీ లేవు.

# జూబ్లీహిల్స్‌లోని ఉద్యానవనాన్ని పరిశీలించిన సీఎం

**జూబ్లీహిల్స్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 44-45లోని సినీనటుడు అల్లు అర్జున్‌కు సంబంధించిన ఎన్‌హాన్స్ భవనం పక్కన రూపుదిద్దుకుంటున్న జీహెచ్ఎంసీ ఉద్యానవనాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకస్మికంగా పర్యటించి సందర్శించారు. ఉద్యానవనం అంతా ఆయన కలియతిరిగి అక్కడ జరుగుతున్న పనుల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులను పిలిచి వారి పరిస్థితి గురించి ఆరా తీశారు. గతంలో ఉద్యానవనం ఉన్న ప్రాంతం అంతా దుర్గంధమయంగా, చెత్తాచెదారంతో ఉండేది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాకముందు ఈ ప్రాంతాన్ని పలుమార్లు గమనించారు. ముఖ్యమంత్రి అయిన అనంతరం ఈ స్థలంలో ఉద్యానవనం ఏర్పాటుకు రెండు, మూడుసార్లు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం రూ. 40 లక్షల నిధులను జీహెచ్ఎంసీ మంజూరు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతుంది. ఇక్కడ పనులన్ని దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలోనే ఉద్యానవనంలో కొనసాగుతున్న పనులను పరిశీలించేందుకు సీఎం అక్కడికి వచ్చినట్లు మున్సిపల్ అధికారులు తెలియజేశారు.



జీహెచ్ఎంసీ కార్మికులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.

# జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్లు 4,01,365

## - తుది జాబితా విడుదల

**జూబ్లీహిల్స్, అక్టోబరు 24, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల తుదిజాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ ప్రకటించారు. నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య గతంలో నియోజకవర్గంలో3,98,982 మంది ఓటర్లుగా ఉండేది. ఉప ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదుకు అవకాశం కల్పించడంతో 2383 మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. దీంతో ఈ సంఖ్య 4,01,365కు చేరింది. ఇందులో పురుష ఓటర్లు 2,08,561మంది, 1,92,779 మంది మహిళలు, ఇతరులు 25, పోలింగ్ బూత్‌లు 407 ఉన్నట్లు తెలిపారు. ఇక తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు రూ. 2.84 కోట్లు స్వాధీనం చేసుకున్నామని, రూ. 3.69 లక్షల విలువైన 512 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో నాలుగు బ్యాలెట్స్ యూనిట్స్, ఒక వీవీ ప్యాట్ వినియోగించనున్నట్లు స్పష్టం చేశారు.

# మూడు రోజుల్లో ముగ్గురు స్నేహితుల ఆత్మహత్యలు

## -అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో కలకలం



వైష్ణవి



రాకేష్



శ్రీజ

**హయత్ నగర్, అక్టోబర్ 24 ప్రభాతవార్త :**

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు ఒకరి తరువాత ఒకరు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి కోహెడ గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... కోహెడ గ్రామానికి చెందిన గ్యార శివరాజు కుమార్తె వైష్ణవి(18), సతాలి వెంకటేశ్ కుమారుడు రాకేష్ (21), బుద్ద నర్సింహా కుమార్తె శ్రీజ (18)లు స్నేహితులు. వారంతా 6-10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. వైష్ణవి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. మందులు వాడకపోవడంతో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈనెల 21న సాయంత్రం ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్తామని చెప్పారు. అంతలో గదిలోకి వెళ్లిన ఆమె చీరతో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎంతకీ బయటకు రాకపోవడంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. వైష్ణవి అంత్యక్రియలకు హాజరైన సతాలి రాకేష్ బుధవారం రాత్రి సోదరుడి షాపులో పడుకుంటానని చెప్పి వెళ్ళాడు. ఉదయం షాపులో చూడగా అతను ఫ్యాన్ కు ఉరి వేసుకుని మృతి చెంది కనిపించాడు. రాకేష్ మరణ వార్త తెలుసుకుని ఇంటికి వచ్చిన బుద్ద నర్సింహా కుమార్తె శ్రీజ గురువారం గదిలో ఫ్యాన్ కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఒకరి తర్వాత మరొకరు వరుసగా మూడు రోజుల్లో ముగ్గురు ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. ముగ్గురు మృతిచెందడం పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పత్తి అమ్మకానికి కపాస్ కిసాన్ యాప్ తప్పనిసరి

-వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్



కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహనకల్పిస్తున్న ఏడిఏ నూతన్‌కుమార్

**సిర్గాపూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
పత్తిపంటను సాగుచేసుకుంటున్న రైతులు మద్దతుధరను అందుకునేందుకు విధిగా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్‌ను బుక్‌చేసుకోవాల్సి ఉంటుందని, వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడిఏ) నూతన్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని వాసర్‌లో కపాస్ కిసాన్ యాప్‌పై, వ్యవసాయ యాంత్రీకరణలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ నూతన్‌కుమార్ మాట్లాడుతూ, ప్రతి రైతు తన ఫోన్‌లో కపాస్ కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారులకు ఇచ్చిన ఫోన్‌నంబర్లు మారితే మరోమారు మారిన ఫోన్‌నంబర్‌ను సంబంధిత ఏఈఓలకు అందచేయాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ పనిముట్లు అవసరమున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, ఏఈఓ సంజీవ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంత్‌సింగ్‌పై ఎంఐఎం దాడి తగదు

**రామచంద్రాపురం, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
గోరక్షుడు ప్రశాంత్‌సింగ్‌పై ఎంఐఎం నాయకుల దాడి హేయమైన చర్య అని బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు బలరాం తీవ్రంగా ఖండించారు. శుక్రవారం బలరాం ప్రభాతవార్తతో మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ ప్రాంగణంలో గోమాతలను తరలిస్తున్న ఎంఐఎం నాయకులను అడ్డుకునే యత్నంలో ప్రశాంత్‌సింగ్‌పై గన్‌ఫైరింగ్ జరపడంతో ప్రశాంత్‌సింగ్ యశోద ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నాడని గుర్తుచేశారు. గోమాతసేవ చేసిన వారికి కాంగ్రెస్‌ప్రభుత్వం అండగా ఉంటుందని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనచేశారని, మరి గోమాతలను రక్షించుకునే ప్రయత్నంలో ఎంఐఎం నాయకులు దాడిచేసి ఆసుపత్రిపాలుచేసిన ప్రశాంత్‌సింగ్‌కు ప్రభుత్వం ఎలా అండగా ఉంటుందో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో పోలీసు కానిస్టేబుల్‌ను హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని హితవుపలికారు.

## సామాజిక సేవాకర్తను సన్మానించిన న్యాయవాది

**నాగల్‌గిద్ద, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
పాండిచ్చేరి యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను అందుకున్న సామాజిక సేవకర్త, రక్తదాత ఓంప్రకాష్‌ను ప్రముఖ న్యాయవాది అలిగె జీవన్ శుక్రవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఎందరికో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడిన ఘనుడు ఓంప్రకాష్ అని కొనియాడారు. కార్యక్రమంలో సమాజిక ఉద్యమకారుడు సరికూరి లక్ష్మణ్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కన్వీనర్ కిష్టయ్య తదితరులు ఉన్నారు.

## మోడల్ యునైటెడ్ నేషన్స్‌కాన్ఫరెన్స్ విజయవంతం



మోడల్ యునైటెడ్ నేషన్స్‌కాన్ఫరెన్స్‌కు హాజరైన ప్రతినిధులు

**కొండాపూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మోడల్ యునైటెడ్ నేషన్స్‌కాన్ఫరెన్స్-2025ను సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ప్రపంచ అవగాహన, రాజనీతి నైపుణ్యాలు నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఈకార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈకాన్ఫరెన్స్‌లో 35దేశాల ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారు. ఈకార్యక్రమం ద్వారా విద్యార్థులు ప్రపంచ సమస్యలపై చర్చిస్తూ, యుఎన్ విధానాలను అనుసరించి, సృజనాత్మక పరిష్కారాలను సమర్పించారు. ఈకార్యక్రమానికి ప్రధానఅతిథిగా డా. ఎంఆర్. మురళీ ప్రసాద్ హాజరయ్యారు. యుకె కామన్‌వెల్త్‌ఫెలో, యుకె కామన్‌వెల్త్ సెక్రటేరియట్ కమిషన్ కంట్రీ అంబాసిడర్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషియల్ స్టడీస్ హైదరాబాద్‌లో లైబ్రేరియన్ (ప్రొఫెసర్‌స్థాయి)గా, భారత ప్రభుత్వ విద్యాశాఖ పరిధిలో సేవలు అందిస్తున్నారు. కార్యక్రమం చివర్లో బెస్ట్ డెలిగేట్, బెస్ట్ స్పీకర్, బెస్ట్ కాస్ట్యూమ్, బెస్ట్ టీచర్ (ట్రైనింగ్), బెస్ట్ స్కూల్ (పార్టిసిపేషన్) అవార్డులు అందజేయబడ్డాయి. మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్-2025 విద్యార్థుల్లో గ్లోబల్ ఆలోచన, సమస్యల పరిష్కారం, నాయకత్వ లక్షణాలను ప్రేరేపిస్తూ విజయవంతంగా ముగిసింది.

## విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ సభను విజయవంతం చేయండి

-మెదక్ యూనియన్ ఉపాధ్యక్షులు పి.మొగులయ్య పిలుపు

**టేక్మాల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
ఈనెల 25వ తేదీన మెదక్‌లో తెలంగాణ విద్యుత్ అర్టిసన్ ఎంప్లాయిస్ సభను విజయవంతం చేయాలని నిర్వహిస్తున్న ఉమ్మడిమెదక్‌జిల్లా సమావేశాన్ని విజయవంతంచేయాలని మెదక్‌జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు పి.మొగులయ్య పిలుపునిచ్చారు. 25వ తేదీన మెదక్ సాయిబాలాజీగార్డెన్‌లో తమ సమస్యల పరిష్కారానికి తలపెట్టిన ఉమ్మడిజిల్లా సమావేశానికి ఉద్యోగులందరు సకాలంలో పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## విద్యుత్ ఉపకేంద్రానికి వెళ్లేదెలా..



ఉపకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో పోసిన ధాన్యం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేటలోని 132/33 కెవి విద్యుత్ ఉపకేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో కొందరు రైతులు ధాన్యాన్ని తూర్పారబెట్టారు. అత్యవసర సమయంలో విద్యుత్ ఉపకేంద్రానికి సిబ్బంది ఎలా వెళ్లగలుగుతారో తెలియని పరిస్థితి నెలకొంది. రైతులు కనీసం రోడ్డుకు పక్కగా తూర్పారబెట్టకుండా రోడ్డు మొత్తం ధాన్యం పోయడంతో విద్యుత్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల అందజేత

**మర్కుక్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గంగాపూర్ ప్రాథమికపాఠశాల ఏడేళ్ల క్రితం మూతపడి ఈవిద్యాసంవత్సరంలో ప్రారంభంకాగా, ఆపాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఎర్రవల్లి గ్రామానికిచెందిన నారన్నగారి రాంమోహన్‌రెడ్డి సొంతఖర్చులతో ఒక్కోవిద్యార్థికి రెండుజతల ఏకరూపదుస్తులను అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయురాలు రమ్య దాత రాంమోహన్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో విద్యా వాలంటరీ స్వప్న, చిలుక రామచంద్రం, దేవి రామచంద్రం, చింతకాయల స్వామి, శ్రీశైలం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా సినీ వారం

-విద్యార్థులను ఉత్సాహపరచిన దర్శకులు దేవా కట్టా, ప్రవీణ్ కాండ్రేగుల




కార్యక్రమంలో సినీ ప్రముఖులు

**పటాన్‌చెరు, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'సినీవారం2025లో మీడియా, చలనచిత్రోత్సవాలను అక్టోబరు 23, 24 తేదీలలో ఘనంగా నిర్వహించారు. గీతం స్టూడెంట్ లైఫ్, ఎఫ్ఎబివో సహకారంతో నిర్వహించిన ఈవేడుకలలో పలుపోటీలు, కార్యశాలలు, ముఖాముఖి కార్యక్రమాలు సృజనాత్మకత, సినిమాటిక్ వ్యక్తీకరణ సమాహారంగా సాగాయి.

ఈ ఉత్సవాలలో భాగంగా, చిన్న నిడివి గల చలనచిత్రాలు(షార్ట్‌ఫిల్మ్), ఎడిటింగ్, ఫోటో గ్రఫీ ఎగ్జిబిషన్ పోటీలను నిర్వహించగా, దేశవ్యాప్తంగా వర్ధమాన చిత్రనిర్మాతలు, మీడియా విద్యార్థులతోపాటు అమెరికాలోని డల్లాస్, దుబాయ్ నుంచి కూడా ఎంట్రీలు రావడం విశేషం. తొలిరోజు ప్రముఖ ఫోటోగ్రాఫర్ మహేష్ పమిడిమర్తి ట్రావెల్ ఫోటోగ్రఫీపై ఉపన్యసించగా, ప్రముఖ దర్శకుడు దేవా కట్టా సంభాషణలు రాయడంపై (డైలాగ్ రైటింగ్) కార్యశాలను నిర్వహించారు. చివరగా, స్ఫూర్తిదాయకమైన చలనచిత్ర ప్రదర్శనతో ముగిసిన తొలిరోజు కార్యక్రమాలలో పలువురు విద్యార్థులు ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. చివరిరోజు, దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల నేతృత్వంలో చిత్ర నిర్మాణం (ఫిల్మ్‌మేకింగ్), స్క్రీన్ రైటింగ్‌పై వర్క్‌షాపులను నిర్వహించారు. ఆతరువాత ఎంపిక చేసిన షార్ట్ ఫిల్ములను ప్రదర్శించారు. ఇక ఈ వేడుకలకే తలమానికంగా నిలిచిన దర్శకుడు సందీప్‌రాజ్, గీతం పూర్వవిద్యార్థి, ప్రముఖనటుడు హర్ష చెముడుతో ఆకర్షణీయమైన ప్రశ్నోత్తరాల కార్యక్రమం విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. చిత్రపరిశ్రమలో తమప్రయాణం, విద్యార్థి జీవితంలోని మధుర జ్ఞాపకాలను వారు విద్యార్థులతో పంచుకున్నారు. సినీనిపుణులతో సంభాషించేటప్పుడు విద్యార్థులు సినిమా పట్ల తమ అభిరుచిని తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం ఓ సృజనాత్మక వేదికగాతోడ్పడింది. అర్థవంతమైన, స్ఫూర్తిదాయకమైన సినీవారం నిర్వహించిన జీస్టూడియో బృందానికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపికచేసిన చిత్రాల ప్రదర్శనకు దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల, గీతంలోని మీడియాస్టడీస్ విభాగాధిపతి సంజీవ్‌కుమార్, అధ్యాపకుడు సుబ్బుపేటేటి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సిఎం



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి దంపతుల కుమారుడు అనీష్‌రెడ్డి వివాహం శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో అంగరంగవైభవంగా జరిగింది. వివాహవేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, విద్యాసాగర్‌రావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, రాష్ట్రమంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహలతోపాటు పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి అంజిరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అకాలవర్షం అపారనష్టం



గవ్వలపల్లి కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వానలకు కొనుగోలు కేంద్రాల వద్దకు తూకంవేయడానికి తరలించినధాన్యం తడిసిపోయి అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చింది. మరోవారంరోజులపాటు తడిసినధాన్యాన్ని తూర్పారబెట్టాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తడిసినధాన్యాన్ని తూకం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు సామాగ్రి అందజేత

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పొన్నాల ప్రభుత్వ ప్రాథమికపాఠశాలకు ఐడిబిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో సిఆర్ఎస్ నిధుల నుంచి ఒకలక్ష 25వేల విలువగల డిజిటల్ సామగ్రిని శుక్రవారం అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం చిన్ని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎల్ఈడి టివి, వాటర్ ప్యూరిఫైయర్, 2బీరువాలు పాఠశాలకు విరాళంగా అందించినట్లు తెలిపారు. అలాగే గ్రామానికిచెందిన నాయకులు దారబోయిన సంపత్‌యాదవ్, శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ. 50వేలు విలువచేసే క్రీడాదుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ అజిత్‌కుమార్, తడకపల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కనకయ్య, ఎంపిపి చైర్మన్ ఈశ్వరమ్మ, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సౌజన్య, సుధా, విద్యా, స్వప్న, శిరీష, హేమలత పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి తగలకుండా పశువులకు టీకాలు

**అక్కన్నపేట, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మండలకేంద్రంతోపాటు జనగామ, కేశనాయక్‌తండా గ్రామాలలో శుక్రవారం పశువైద్యాధికారి సుకన్య ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటువ్యాధులు సోకకుండా ముందస్తుగా 200ఆవులు, గేదెలకు టీకాలువేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటువ్యాధి టీకాలు వేయించుకోవడం వల్ల పశువులకు ఎలాంటివ్యాధులు సోకకుండా ఉంటాయని దీనిద్వారా వ్యాధినిరోధకశక్తి పెరిగి వాటి పెరుగుదలకు తోడ్పడుతుంది. పశువులకు టీకాలు వేయించుకోవాలని రైతులకు విజ్ఞప్తిచేశారు. తద్వారా వ్యాధి నుండి నివారణ పొందవచ్చని అన్నారు.

## మన్యానాయక్ తండా రోడ్డుపై జాతీయ ఎస్టీ కమిషన్ ఆరా

**నాగల్‌గిద్ద, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మన్యానాయక్ తండా రోడ్డు గురించి ఎస్టీ కమిషన్ ఆరా తీసింది. మన్యానాయక్ తండాకు చెందిన ఇద్దరు గర్భిణీస్త్రీ కౌసల్యాబాయి పురిటి నొప్పులతో అవస్థలు పడుతూ ఉండగా ఆగస్టు 10న 108 వాహనం తండాకు వచ్చే పరిస్థితి లేక భర్త వాసుదేవ్ తన భుజాలపై గర్భిణీని తీసుకుని మెయిన్‌రోడ్డు వరకు మోసుకుపోయి అంబులెన్స్‌లో దింపిన విషయం పాఠకులకు విదితమే. విషయాన్ని మండల పరిధిలోని మాడ్వార్‌కు చెందిన గిరిజన నాయకులు రాజునాయక్ వార్త పత్రిక పేపర్ కటింగ్‌ను జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకుపోగా కమిషన్ రోడ్డుపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. తండాకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు రోడ్డు భవనాలశాఖ అధికారులకు సూచించారు. విషయాన్ని ప్రభాత వార్త రోడ్డు భవనాలశాఖ డిప్యూటీ ఈఈ రవీందర్ దృష్టికి తీసుకుపోగా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయినట్లు పేర్కొన్నారు.

## డిజిటల్ మహిళాసంఘం ప్రారంభించిన కార్పొరేటర్



డిజిటల్ మహిళాసంఘం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్‌లో శుక్రవారం డిజిటల్ మహిళాసంఘం ఏర్పాటుచేసిన సమృద్ధి డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ సింధు మహిళలు తయారుచేసిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. మహిళలప్రతిభను గుర్తించిన సింధు వారిని ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం అందించే పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన పొందాలన్నారు. కార్యక్రమంలో డిజిటల్ మహిళాసంఘం అధ్యక్షులు ఆమ శ్రీనివాస్, కార్యదర్శి సీతాలక్ష్మి, కోశాధికారిణి అనిత, ఎగ్జిక్యూటివ్ అధికారిణి వసంతి చందా, ట్రైనింగ్ అధికారిణి కట్ట సుజిత, బిఆర్ఎస్ మహిళా సర్కిల్ సెక్రటరీ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## మరాఠి కృష్ణమూర్తికి ఘన సన్మానం



మరాఠి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న దళిత సంఘాల నేతలు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
తెలంగాణ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన మరాఠి కృష్ణమూర్తిని శుక్రవారం దళితసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మరాఠి కృష్ణమూర్తి మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలతోపాటు బహుజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దళితసంఘాల నాయకులు బింగి స్వామి, తుమ్మ శ్రీనివాస్, పొన్నాల కుమార్, దాసరి ఏగొండ, చిప్పల యాదగిరి, ఎల్లయ్య, నీరుడి స్వామి, పుట్ట రాజు, శివకుమార్, బ్యాగరి వేణు పాల్గొన్నారు.

# కొండపోచమ్మ ఆలయం వద్ద బహిరంగ వేలం



కొండపోచమ్మ ఆలయం వద్ద వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

**జగదేవ్‌పూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్‌నర్సాపూర్‌లోవెలసిన కొండపోచమ్మ అమ్మవారి ఆలయానికి సంబంధించిన ఒడిబియ్యం, లడ్డూ, పులిహోర, కొబ్బరికాయలు, పూలదుకాణం, కొబ్బరిముక్కల సేకరణ తదితరమైన వాటికి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈవేలంపాటలో వివిధ గ్రామాల నుండి అనేకమంది పాల్గొన్నారు. బహిరంగ వేలం పాటలో తీగుల్‌నర్సాపూర్ గ్రామానికి చెందిన బోయిని కిషన్ రూ.23.10 లక్షలకు వేలం పాడి కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయించేహక్కును దక్కించుకోగా అమ్మవారి ఒడిబియ్యం, చీరల సేకరణను డి.మహేష్ రూ.25.70 లక్షలకు దక్కించుకోగా, కొబ్బరిముక్కల సేకరణను బసవరాజు రూ.7.90 లక్షలకు, లడ్డు, పులిహోర విక్రయించుకునే హక్కు శ్రీకర్‌రెడ్డి రూ.30.20 లక్షలకు వేలంపాడి దక్కించుకున్నారు. అలాగే దేవాలయం ముందు పూలను విక్రయించుకునే హక్కు నవీన్ రూ.2లక్షలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రవికుమార్ మాట్లాడుతూ బహిరంగ వేలంపాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఖర్చుచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గర్నెపల్లి రజిత రమేష్, ఆలయ డైరెక్టర్లు అనుగీత, కోట ఆశయ్య, చెక్కల నరేష్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌రెడ్డి, ఆలయసిబ్బంది కనకయ్య, అంజయ్య, చందు, హరిబాబు, అర్చకులు గోవర్ధన్, కొండయ్య, తిరుపతి, లక్ష్మణ్, రమేష్, ఐలయ్య, గ్రామస్థులు భూపతిరెడ్డి, లక్ష్మినరసింహారెడ్డి, యాదగిరి, శ్రీను, స్వామి, కనకయ్య, సత్యనారాయణ, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ జడ్పిటిసిని పరామర్శించిన నరోత్తం

**జహీరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
కోహీర్ మండల మాజీ జడ్పిటిసి సభ్యులు జి.రాందాస్‌ను ఎస్సీ కార్పొరేషన్ మాజీచైర్మన్ వై.నరోత్తం శుక్రవారం పరామర్శించారు. అనారోగ్యంతో అవస్థలుపడుతున్న రాందాస్ జహీరాబాద్ పట్టణంలోని సన్రోహి ఆసుపత్రిలో చికిత్సలు అందుకుంటున్నట్లు తెలుసుకున్న నరోత్తం ఆసుపత్రికిచేరుకుని రాందాస్‌ను పరామర్శించి ఆరోగ్యస్థితిగతులను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాందాస్‌కు మెరుగైనవైద్యం అందించాలని ఆసుపత్రి డాక్టర్లను నరోత్తం కోరారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కును అందచేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
వ్యవసాయ క్షేత్రంలో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రాజు(23) అనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు మెరుగైనవైద్యానికి 4లక్షల రూపాయల ఎల్‌ఓసిని శుక్రవారం వ్యాధిగ్రస్థుడు రాజు కుటుంబసభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ పాల్గొన్నారు.

## చిప్ డిజైన్, తయారీలో అపార అవకాశాలు

-మైక్రోచిప్ ఇండియా సీనియర్ టెక్నికల్ స్టాఫ్ ఆర్.సంజీవ్‌కుమార్

**పటాన్‌చెరు, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
జాతీయ మేక్ ఇన్ ఇండియా నినాదంతో చిప్ డిజైన్, తయారీపై గణనీయంగా దృష్టి సారించిన నేపథ్యంలో, మనదేశంలో సెమీకండక్టర్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోందని మైక్రోచిప్ ఇండియా సీనియర్ టెక్నికల్ స్టాఫ్ ఆర్.సంజీవ్‌కుమార్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్‌లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం వీఎల్ఎస్ఐ కెరీర్లు-మార్గాలు, నైపుణ్యాలు, సెమీకండక్టర్ యుగంలో అవకాశాలు అనే అంశంపై గురువారం నైపుణ్యోపన్యాసాన్ని ఏర్పాటుచేసింది. పరిశ్రమ నిపుణుడి హోదాలో పాల్గొన్న సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. వీఎల్ఎస్ఐలో విజయవంతమైన కెరీర్‌ను నిర్మించడానికి ప్రాథమిక అంశాలపై మంచి అవగాహన ఆవశ్యకమని చెప్పారు. కార్యక్రమంలో ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి పర్యవేక్షణలో, ప్రొఫెసర్ సిహెచ్.సుమంత్‌కుమార్, ఎం.నరేష్‌కుమార్, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన హౌజింగ్ ఈడి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న హౌజింగ్ ఈడి చలపతిరావు

**న్యాల్‌కల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మండలంలోని మెటల్‌కుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం గృహనిర్మాణశాఖ ఈడి చలపతిరావు పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని లబ్దిదారులకు చలపతిరావు, డిఈ ఆంజనేయులు, ఏఈ శివానందులు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్‌నాయకులు ఈ.పాండురంగారెడ్డి, శ్రీకాంత్, సాలమన్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్



తార్ధన్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

**చౌటకూరు, ఆగస్టు 24, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తార్ధన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన డిసిఎంఎస్ వరి కొనుగోలుకేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ కిష్టయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వరి పండించిన రైతులు ధాన్యాన్ని కొనుగోలుకేంద్రానికి తరలించి లబ్ధిపొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్దమ్మ, నాయకులు మక్సుద్ అలీ, ఎస్సాన్ పాషా, మౌలానా, జమాల్, మహమూద్, జాఫర, బాలరాజ్, షఫియోద్దిన్, సాజిద్, రసూల్, కృష్ణకాంత్, ఆంజనేయులు సుభాష్, యాదగిరి, సద్దాం, చంద్రయ్య, అఖిల్, బేక్ పాల్గొన్నారు.

## పుల్‌కల్‌లో శ్రీధర్ ఆసుపత్రి సీజ్




సీజ్ అయిన శ్రీధర్ ఆసుపత్రి దృశ్యం

**పుల్‌కల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని శ్రీధర్ ప్రైవేటు ఆసుపత్రిని శుక్రవారం డిఎంఅండ్‌హెచ్ఓ నాగనిర్మల సీజ్‌చేశారు. అనుమతులు లేకుండా ఆసుపత్రిని నిర్వహిస్తున్నారన్న సమాచారంతో జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ తనిఖీ చేసి అనుమతులు లేకుండానే ఆసుపత్రిని నిర్వహిస్తున్నట్లు గుర్తించి ఆసుపత్రిని సీజ్‌చేశారు. శ్రీధర్ ఆసుపత్రి బినామీపేరుతో రిజిస్ట్రేషన్ అయిందని, ఆసుపత్రిని నడిపేది మరోవ్యక్తి అని తేలిందన్నారు. కార్యక్రమంలో జిల్లా, పుల్‌కల్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన



విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**నర్సాపూర్, అక్టోబరు 24, ప్రభాతవార్త:**
పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలో భాగంగా శుక్రవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆయుధాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పోలీసులు వినియోగించే ఆయుధాలపై ఉపయోగించే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ టియర్ గ్యాస్ బాంబు, స్క్వాడ్ మెటల్, డిటెక్టర్స్, రైఫిల్, గన్ వంటి ఆయుధాలను వినియోగించే విధానం, వాటి ప్రాముఖ్యతను ఆయుధాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై జగన్నాథం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.